# ఇలాంటి వారూ వుంటారు

-కందుకూరి వెంకట మహాలక్ష్మి

తులసమ్మ గారికి వరుసగా ముగ్గురూ అబ్బాయిలే పుట్టారు. అదీ ఏణ్ణర్థం, రెండేళ్ళ తేడాలో-

పెద్ద కొడుకు పుట్టగానే వంశోద్ధారకుడు, ఇంటికి పెద్దాడు అంటూ తల్లిదండ్రులూ, తొలి మనమడంటూ బామ్మా, తాతలూ, అమ్మమ్మా అతి అపురూపంగా పెంచసాగారు. అంతేకాకుండా బారసాలకి నగలూ, అన్నప్రాసనికి కంచం దగ్గర నుంచి పద్ధతిగా కొని, ఊరంతా పిల్చి ప్రతీ ముచ్చటా తీర్చారు.

ఇక రెండోవాడు రెండో వాడే అయ్యాడు. తప్పనిసరిగా జరప వలసినవి మాత్రం లాంఛనంగా జరిపి పూరుకున్నారు. ఆడ పిల్ల కావాలనుకున్న వారికి మళ్ళీ అబ్బాయే పుట్టడంతో కొంత నిరుత్సాహ పడ్డారు.

ఇక మూడోవాడు పుట్టగానే 'అయ్యో ఈసారన్నా ఆడ పిల్ల పుడుతుందను కున్నాం, మగ పిల్లాడే పుట్టా'డని అంతా ఓ పదిసార్లనుకున్నా, తరువాతరవాత ఆఖరి వాడూ, పైగా బొద్దుగా ముద్దుగా వుండడంతో గారంగా పెంచేవారు. ముగ్గురు పుట్టారింక చాలనుకుని ఆపరేషన్ చేయించుకోవడంతో ఇంక వుడతారా, ఇంక పెంచబోతామా! ఏంచేసినా వీడికే కదా! అంటూ పెద్దాడికి జరిపినట్లే ఆఖరి వాడికీ అన్నీ యథావిధిగా జరిపారు.

ముగ్గురికీ కిరణ్, రవీ, పవన్ అని పేర్లు పెట్టినా కిరణ్‌ని 'పెద్దాడా!' అని, పవన్‌ని 'చంటాడా!' అనీ, రవిని మాత్రం 'రవీ' అని పిల్చేవారు యింట్లో వాళ్ళంతా.

'ఇంటికి పెద్దాడు. రేపు మనందరికీ వాడే అన్నీ చెయ్యాలి" అంటూ అతని విషయంలో ఏం ఖర్చు చెయ్యవలసి వచ్చినా ఆలోచించకుండా ఖర్చుపెట్టేవారు. చంటివాడు, ఆఖరి వాడూ" అంటూ పవన్‌కి కూడా కిరణ్‌కి లాగే అన్నీ అమర్చేవారు. మధ్యవాడు రవి మాత్రం ఎవరి దృష్టిలోకీ వచ్చేవాడు కాదు. ఇంట్లో అందరూ అతని కన్నా పెద్దవాళ్ళే! ఏమిటడిగినా, దేనికేడ్చినా "నోరు మూసుకో వెధవా" అంటూ తిట్టేవారు. రవి వాళ్ళనేం అనలేక తనకంటే చిన్నవాడైన పవన్‌కి అన్నీ యిస్తున్నారన్న వుక్రోషంతో తమ్ముడి మీద ఈర్ష్య పెంచుకుని పవన్‌ని కొట్టి, గిల్లి తన కోపం కక్ష తీర్చుకునే వాడు. ఇంట్లో పెద్దవాళ్ళ భరోసా చూసుకుని రవి ఏదన్నా అనగానే, పెద్దగా ఏడుపు ప్రారంభించే వాడు. దాంతో పెద్దవాళ్లొచ్చి 'బుద్ధిలేదురా వెధవా! దున్నపోతులాగున్నావు. చిన్న పిల్లాడినలా కొడతావుట్రా?" అంటూ కొట్టేవారు.

"తమ్ముడు పుట్టగానే నేను దున్నపోతునయిపోయాను! రెండేళ్ళ క్రితం తనకున్న వయసు తమ్ముడి కిప్పుడున్నా యింకా చంటాడనే అంటారేమిటీ?" అనుకునేది రవి లేత మనసు.

అలా పెద్దవాడినీ, ఆఖరి వాడినీ ఒకలాగ పెంచుతున్న పెద్దవాళ్ళ మాటెలాగున్నా, పిల్లల మీద మాత్రం దాని ప్రభావం చాలా కనపడేది. కిరణ్ తనకా యింట్లో యిచ్చే ఫ్రీడంని ఉపయోగించుకుని, తన్ని తనెప్పుడూ చాలా గొప్పవాడిగా ఊహించుకుని, ఎవర్నీ లక్ష్యపెట్టకుండా నడుచుకునే వాడు. ఇంట్లో వాళ్ళు కూడా అతనికి భయపడి అన్నీ చేసేవారు. ఆఖరి వాడికి గారం, ముద్దు ఎక్కువయి పెంకెతనం, మంకుతనంతో అనుకున్నవన్నీ పంతం పట్టి సాగించుకునేవాడు. ఎప్పుడన్నా ఏ ఒక్కరన్నా పవన్ పేచీ భరించలేక కేకలెయ్యబోయినా, కొట్టబోయినా రెండో వాళ్ళొచ్చి "పోనీలెండ్రా! చంటి వెధవ అడిగిందేదో యిచ్చెయ్యండి. పెద్దాడయితే వాడే మానేస్తాడు" అంటూ అడిగిందిచ్చేసే వారు.

ఇంక రవిని పెంచిన తీరు, వారికి విరుద్ధంగా వుండేది. దాంతో అతనిలో పిరికి తనం, భయం ఏదీ బైటికి చెప్పలేక మొహమాటం, సిగ్గులాంటివి చోటు చేసుకుని మందకొడిగా తయారయ్యాడు. ఏదన్నా అనబోయినా 'నోరు మూసుకో వెధవా! నీ మొహానికి అదొకా?" అంటూ అతని స్వభావాన్ని వేలెత్తి చూపి వెటకారమాడే వారే తప్ప. అతనలా తయారవడానికి కారణం తామే అన్న విషయం మాత్రం తెలుసుకునే వారు లేరా యింట్లో ఏ ఒక్కరూ. అంతే కాకుండా యింటికొచ్చిన వారితో "మా పెద్దాడు పెద్దాడేనండీ! చిన్నప్పటి నుంచీ వాడిలో ఓ రకం హుందాతనం, పట్టుదల వున్నాయండీ. అవీ రోజుల్లో పైకి రావడానికి కావలసిన లక్షణాలు" అనే వారు. ఇక పవన్ విషయం రాగానే 'మా చంటాడు ఎంత చురుకనుకున్నారు. మనం ఏం చేస్తే అది వెంటనే చేస్తాడు. పైగా అనుకున్నది సాధించి తీరతాడు" అంటూ మాకు బెంగల్లా ఈ రవిగాడి గురించేనండీ. ఉత్త భయస్థుడు, పిరికివాడూ నండీ! చురుకుతనం లేదు. ఈ ప్రపంచంలో ఎలా బ్రతుకుతాడో తెలీటం లేదు" అంటూ జాలి గొలిపేలా అంటూంటే వున్న ధైర్యం కూడా పోయి నిజంగా స్తబ్దుగా తయారయ్యాడు రవి.

కిరణ్ తనేం చేసినా చెల్లుతుందనే ధైర్యంతో పని ప్రారంభించే వాడు. పవన్ తను ఏపనన్నా గొడవ చేసయినా సాధించుకోగలననే అహంతో ప్రతీ పని చేసే వాడు. ఇక రవి ఎవరేం తిడతారో! ఎవరేమంటారో అన్న భయంతో బితుకుబితుకుగా చేసే ప్రతి పని పాడు పనే అవడం దాంతో "చాతకానివాడివి చాతకానట్లు పడుండకూడదురా!" అంటూ మరిన్ని తిట్లు, చీవాట్లు తినేవాడు.

పెద్దాడిని చదివిస్తే కుటుంబం బరువు బాధ్యతల్ని మోస్తాడంటూ కోచింగ్ క్లాసులకి పంపించి ఇంజనీరింగ్‌లో సీటు రాకపోయినా డొనేషన్ కట్టి ఇంజనీరింగులో చేర్పించారు. వెంటనే కాలేజీ చదువుకొచ్చిన రవి గురించి యింట్లో వాళ్ళు పెద్దాడికి ఇంజనీరింగ్‌లో చేర్పించడానికి బోల్డు ఖర్చయింది. మళ్ళీ వెంటనే ఎక్కడి నుంచి తెస్తాం? పోనీ అప్పో, సొప్పో చేసి వీడి చదువుకీ ఖర్చు చేస్తామనుకోండి - పాసవుతాడనే ముంది. తెలివి తేటలు లేవు. చురుకుతనం లేదు. బియ్యే చెప్పించి బియ్యీడీనో, ఎమ్మేనో చెప్పించి ఉద్యోగంలో పెట్టేస్తే పరిపోతుంది అనుకుని బియ్యేలో చేర్పించారు. అదే మనుష్యులు పవన్ చేసే ప్రతి పనినీ పొగుడుతూ వీడు ఐఎఎస్ ఆఫీసరవుతాడు. ఆ తెలివి వీడిలో వుంది అనేవారు. పవన్ నిజంగా ఐ.ఎ.ఎస్ అవకపోయినా బికాం చదివి సియ్యే చెయ్యసాగాడు.

చదువుకునే రోజుల్లో ఇంట్లోనూ, బైటా ఏ పని చెయ్యాలన్నా బియ్యే చదువుతున్న రవి చులకనగా కనపడే వాడు. ఎప్పుడన్నా 'నాకు పరీక్షలు వెళ్ళ'నంటే 'ఇంతోటి నీ బియ్యే పాసవకపోతావా? వాళ్ళు సైన్సు, కామర్సు స్టూడెంట్లు చదవక పోతే కష్టం" అంటూ గదిమి పంపేవారు.

కిరణ్ ఇంజనీర్‌గా, రవి గుమస్తాగా, పవన్ ఓ ప్రయివేటు కంపెనీలో అక్కౌంట్సు ఆఫీసరురగా సెటిలయ్యారు.

చదువులు, ఉద్యోగాలు చూసి ఆడపిల్లల్నిచ్చే ఈ కాలంలో కిరణ్, పవన్‌లకి పెద్దింటి పిల్లల్నిచ్చి, రవికి ఓ సామాన్య కుటుంబంలోని పిల్లని యిచ్చారు. భర్తల హోదాలని బట్టి భార్యలకి గౌరవమిచ్చే మన సమాజంలో కిరణ్, పవన్‌లకి ఒక రకం హోదా, రవి భార్యకి మరొకరకం ఆదరణ లభించేవి. రవికి యింటా, బయటా లభించే మర్యాదే రవి భార్యకీ లభించేది. అత్తగారు 'మా

## శృతి తప్పిన గీతం

కోకిలమ్మ గొంతులో
జీర వినిపిస్తున్నదెందుకో
వసంత రాగాలు వినిపించే వేళలో
విషాదగీతం వినిపిస్తోంది!
కేలండర్లే మారినా, తిథులే మారినా
అంతరంగంలో మార్పు రావడం లేదు!
ఉగాది అంటే చైతన్యానికి ప్రతీక
మనిషి మాత్రం మత్తులో
మత్సరంతో వేగిపోతున్నాడు!!
మనిషి మనిషిగా ఎదగడం లేదు
సాటి మనిషిని సజావుగా మననీయడం లేదు
ఎంతగా ఎప్పటికప్పుడు
ఆశను పెంచుకుంటున్నా
అడియాసలో ఉస్సురనాల్సొస్తోంది!
ఏవైపు చూసినా కక్షలు, కార్పణ్యాలు
ఎల్లలు లేని హింసాకాండలు
మనిషి మారణాయుధమై
మహిని అతలాకుతలం చేస్తున్నాడు!
స్వార్థంతో రగిలే మనిషి
సహజీవనం సాధించేదెన్నడు?
అందుకే ఈ ఉగాది శుభవేళ
చేయి చేయి కలిపి శపథం చేద్దాం!
అంతరాలు వీడి
అంతర్యాలు ఒకటిగ చేసి
కలిసికట్టుగ ముందుకు సాగుదాం!
అన్యాయాలకు, అక్రమాలకు స్వస్తి పలుకుదాం
అప్పుడే శృతి తప్పిన కోకిలమ్మ గొంతు
అమృత ధారలు కురిపిస్తుంది
గతితప్పిన మనిషి బతుకులో
ఆనంద సుమాలు విరబూస్తాయి!

-జింబో

పెద్దాడి అత్తారిచ్చారు. మా చంటాడి అత్తారు యివి పెట్టారంటూనే నలుగురికీ వాళ్ళు తెచ్చిన నగలూ, చీర సారెలు చూపిస్తూ, పాపం రవి అత్తారికేముందని యిస్తారు? వాళ్ళకే గడవడం కష్టం" అంటూ నిజంగానే జాలి పడుతున్నా , ఆ మాటలు రవి భార్య మణి మనసునెంత బాధించేవో ఆలోచించే వారు కాదు. అత్తకి లోకువైన మణి తోటి కోడళ్ళు రమ, రత్నాలకి కూడా లోకువే అయింది. తమ అయినింటితనాలని కనబర్చుకుంటూ మణిని చులనకగా చూసే వారు. ఆ తేడా అలా వారి పిల్లల మధ్య కూడా కనపడేది.

తాతల తరం ముగిసింది. ఉద్యోగ రీత్యా ముగ్గురూ మూడు ఊళ్ళల్లో వుండజొచ్చారు. తల్లి తండ్రులు ఎక్కువగా కిరణ్, పవన్‌ల దగ్గర వుండే వారు. ఏ కథా కార్యం వచ్చినా, ఎవరికి అనారోగ్యం వచ్చినా రవి భార్యని సహాయానికి రమ్మనే వారు. మణి వెళ్ళక పోయినా, రవి ఒక్కడు వెళ్ళినా రవిని ఆడిపోసే వారు. రవి తన ఖర్చులు, పిల్లల చదువుల గురించి చెప్పబోతే అతని సాధక బాధకాలని అర్థం చేసుకోడానికి బదులు వెటకారంగా మాట్లాడేవారు. మణి నెలేసి రోజులు చాకిరీలకి వాళ్ళిళ్ళల్లో వుంటే యింట్లో వాళ్ళకి తిండెలా వస్తుందనిగానీ, పిల్లల చదువులేమవుతాయనిగానీ ఒక్కరూ ఆలోచించేవారు కాదు. మెతక స్వభావం గల రవి కూడా "మా వాళ్ళేమన్నా అనుకుంటారేమో మణీ! వాళ్ళని మనం ఎలాగూ దగ్గర పెట్టుకోలేం కదా! కనీసం వెళ్ళి చాకిరీ అన్నా చెయ్యకపోతే ఎలాగా? వెళ్ళు!" అంటూ మణిని పంపడంతో రవి పిల్లలు సరిగ్గా చదువుకోక, రవిలాగా తయారవసాగారు. ఇలా ఊళ్ళు తిరగడంతో ఖర్చు లెక్కువయ్యి డబ్బు చాలక ఇంట్లో యిబ్బంది పడుతూ 'ఎవరేమనుకుంటారో' అని చేసే ఖర్చు లెక్కువయ్యేవి.

డబ్బున్న వాళ్ళకే డబ్బు, పరపతీ లభిస్తాయి. వాళ్ళకి అన్నీ చిటికెన వేలి మీద ఆడతాయి. ఎంట్రన్సుల్లో సీట్లు రాకపోయినా డొనేషనిచ్చి చదివించుకుంటారు. పరపతు లుపయోగించి ఉద్యోగాలు వేయించుకుంటారు. రవిలాంటి వారివి ఎందుకూ పొందని బ్రతుకులు, ఆదరణలేని బ్రతుకులు ఇంట్లో వాళ్ళు గానీ, తోడబుట్టిన వాళ్ళు గానీ, ఊళ్ళో వాళ్ళు గానీ, అర్థం చేసుకోలేరు. భయపెట్టి, అణగదొక్కి పెంచితే పిల్లలు పైకి రాలేరు. నలుగుర్లో కలవ లేరు. జీవితంలో ఎదగలేరు. ఎవరితోటి పోటీ పడలేరు. భయం భయంగా వేసే ప్రతీ అడుగు తప్పటడుగు అయ్యేది. దాంతో ఎక్కడ వేసిన గొంగళిలా... అక్కడే వుండి పోతారు. అది వారితో ఆగిపోదు. దాని ప్రభావం భార్య, బిడ్డల మీద కూడా పడుతుంది. అలాంటి వారి భార్య అందరి దృష్టిలో చులకనగా, ఓ దాసీగా కనబడుతుంది. వారి బిడ్డల భవిష్యత్తు కూడా డబ్బు లేకో, సరిగ్గా చదువుకోనివ్వకో చెడి పోతుంది. అలా వారి బ్రతుకులు అడుగంటుతూనే వుంటాయి.

తన పిల్లలూ అన్నా, తమ్ముడి పిల్లల్లా వుండాలని మొదట్లో ఆలోచించే శక్తి లేక, వాళ్ళని తనలాగే తయారు చేశాడు. పరిస్థితి చెయ్యి దాటి పోయాక, ఇప్పుడు తను చేసిన దాని గురించి బాధ పడసాగాడు. గొర్రె తోక బ్రతుకుతో విసిగిపోయి, ఆ విసుగు భార్యా బిడ్డల మీద చూపించసాగాడు. దాంతో కుటుంబంలో వుండవలసిన సుఖ, శాంతులు కొదవయ్యాయి. కుటుంబీకుల మధ్య వుండవలసిన అనురాగం, సున్నితత్వం లేకుండా పోయాయి. భార్యా బిడ్డలకి రవి అంటే విసుగు, చిరాకు కలిగేవి. ఈ పరిస్థితికి కారణం 'నువ్వంటే' 'మీ'రంటూ నిందించుకునే వారు. భార్య బావగారు, మరిదితో తనని పోల్చి దెప్పుతున్నప్పుడు పౌరుషంతో రవి పిచ్చివాడిలా ఎగిరిపోయేవాడు. ఇలా ఆఖరికి భార్యా బిడ్డలు కూడా తన్ని లక్ష్య పెట్టక పోవడంతో తన మీద తనకే చిరాకు కలిగేది.

తల్లిదండ్రులకి బిడ్డలంతా సమానం అంటారు. కానీ రవిని పెంచినట్టు పెంచే తల్లిదండ్రులు కూడా వుండడం వల్ల రవిలాంటి వారు కూడా దేశంలో వున్నారు. వారి గురించి ముందు తల్లిదండ్రులు ఆలోచించి చేయూతనిచ్చి, పెద్దాడిలా, చంటాడిలా ఆప్యాయంగా రవిని కూడా పెంచి వుంటే ఏ పెద్ద ఆఫీసరో అయ్యేవాడేమో!

రవి కొడుకు లిద్దరూ కూడా రవిలాగా చిన్నచిన్న ఉద్యోగాల్లో చేరి, గొర్రె తోక బ్రతుకులు బ్రతుకుతున్నప్పుడు మాత్రం అనుకునే వాడు. 'అన్నయ్యా, తమ్ముడిలా నన్ను పెంచి వుంటే, నేనూ పెద్ద ఉద్యోగస్తుడినయి వుంటాను. పోనీ అది నా ఖర్మ అంతే అనుకుని, నా పిల్లల విషయంలోనయినా నేను కళ్ళు తెరుచుకుని తెలివిగా నడుచు కుని వుంటే?! కనీసం భార్య మాటలు విని, ఆమె చెప్పినట్లు నడుచుకుని వుంటే?? అన్నయ్య, తమ్ముడి పిల్లల్లా నా కొడుకులు కూడా బాగా చదువుకుని మంచి ఉద్యోగాలు చేసుకుంటూ వుందురేమో! దీనికి ఎవరు బాధ్యులు? నా పతనానికి నా తలిదండ్రులు, నా బిడ్డల పతనానికి నేనూ బాధ్యుడిని. నన్ను పాడు చేశారు. నేను పాడయిపోయి, నా పిల్లల్ని నేను పాడు చేసుకొని జీవితమంతా దుర్భరం చేసుకున్నాను.

ఆఖరికి అన్న, తమ్ముడి పిల్లలు కూడా తన పిల్లల్ని చిన్న చూపు చూసినప్పుడు బాధపడడంతప్ప వారిని ఏమీ అనలేని చేతకాని వాడిగానే మిగిలి పోయే వాడు.

చేతులు కాలిపోయాయి. ఇంక ఆకులెందుకు? చేతకాని వాడిగా, పిరికి వాడిగా మిగిలి పోవాలి - చేతకానితనానికి, పిరికి తనానికి ఫలితంగా మిగిలిన బిడ్డల్ని చూసుకుని, బాధపడుతూ బ్రతుకికంక యిలా చివరిదాకా సాగించాలంటే" అనుకునే వాడు బాధగా. ●

## ఆర్.ఎస్.కృష్ణమూర్తి కథా పురస్కారం

ఆర్.ఎస్.కృష్ణమూర్తి స్మారక పురస్కారం 2004 ఎంపిక కోసం కథలను పంపవలసిందిగా ఆర్.శైలజ ఒక ప్రకటనలో కథా రచయితలకు విజ్ఞప్తి చేశారు. కథ నిడివి 20 పేజీలకు మించరాదు. ఎక్కడా ప్రచురితం కారాదు. మూడు బహుమతులు- మొదటిది మూడు వేలు, రెండవ బహుమతి రెండు వేలు, మూడవ బహుమతి వేయి రూపాయలు. ఉత్తమ కథలుగా ఎంపిక చేసిన వాటికి జూన్ ఆరవ తేదీన నగదు బహుమతులు ఇస్తారు. కథలు పంపవలసిన చిరునామా- ఎస్.ఎస్.మూర్తి, 4-49, నాయుడుతోట బస్ స్టాప్, వేపగుంట పోస్టు, విశాఖపట్నం-47.

## బాల్యంలోకి ఒదుపుగా...

బతుకంతా తన భుజాల మీద తన బాల్యాన్ని
మోసుకుంటూ తిరుగుతాడు ప్రతివాడూ
అత్యంతానందానికీ- అనంత విషాదానికీ లోనయినప్పుడల్లా
బాల్యాన్నే నెమరేసుకుంటాడు ప్రతివాడూ
ఎంతెదిగినా- ఎన్నెన్ని మార్గాలు కదచినా
మనిషితనపు అసలు హోదా- సిసలైన చిరునామా బాల్యమే
బాల్యమే మనిషికి బలమైన చోదక శక్తి
బాల్యపు విస్తరణా-విస్తీర్ణమే మనిషి నిలువెత్తు ఉనికి
బాల్యాన్ని విడిచేశాననుకుంటూ మనిషి
బాల్యంనాటి ప్రణాళికా రచనలతోనే ప్రవహిస్తుంటాడు
ముందుకైనా- వెనక్కయినా
పసితనాన్ని పదిలపర్చుకున్నంతవరకే
వికారాల నుండి విముక్తి మనిషికి ఎప్పటికైనా
మనిషి మనీషిగా ఎదగబోవడమంటేనే అందమైన బాల్యం
నిమిషమైనా మనిషి పసితనాన్ని వీడి మనగలుగుతాడనుకోవడం
చిత్త చాంచల్యం
పసితనానికి పదునైన రెక్కలు తొడగడం నిజమైన ఎదుగుదల
బాల్యం నుంచి బాల్యం మీదుగా బాల్యంలోకి ఒదుపుగా-
ప్రయాణించడమంటేనే బంధనాల నుంచి శాశ్వతంగా
మనిషికి విడుదల

పసితనం చుట్టూ అలముకొన్నవే
పసితనాన్ని ఆసాంతం ఆశ్రయించినవే
మనిషి విలువలూ- మనిషి విశేషాలూనూ
గర్భస్థ శిశువుగా వున్న నాటి నుంచి
వెంటాడుతూ వచ్చిన మనిషి తాలూకు గుండె చప్పుడులు
అమ్మ నుండి సంక్రమించిన స్వప్నాలే
అందివచ్చిన సిరులూ-మనిషికి సంపదలు ఎప్పటికీనూ!

-వేణు సంకోజు

## రామకృష్ణ శాస్త్రీయం

మల్లాది రామకృష్ణశాస్త్రి గారు తెలుగు భాషకి సౌందర్యం, సౌకుమార్యం, సౌరభం ఇనుమడింప చేసిన ప్రముఖులు. అయితే ఆయన ఆంగ్ల భాషా పాండిత్యం ఆ భాషలో తలనెరిసిన పండితులకి సయితం ఆశ్చర్యం కలిగించేది. సాధారణంగా అవతలి వ్యక్తి ఆంగ్ల భాషలో కొమ్ములు తిరిగిన వాడయినా, అతను తెలుగు వాడయితే శాస్త్రిగారు తెలుగులోనే మాట్లాడేవారు. అదీ సరళమైన తెలుగులోనే. శాస్త్రి గారి ఈ తెలుగు భాషాభిమానాన్ని ఆంగ్ల భాషా ద్వేషమని తప్పుగా భావించిన ఒకరు "మీరెందుకు ఇంగ్లీషులో మాట్లాడరు" అని ఆయనను అడిగారు. దానికి ఆంగ్ల భాషా సారాన్ని కాచి వడపోసిన శాస్త్రి గారు "మనకీ ఇంగ్లీషు వచ్చని వెల్లడించడానికి మాట్లాడాలా, లేక అవతలి వారికి అర్థమవలేదని తెలిసి ఆనందించడానికి మాట్లాడాలా" అన్నారు!

-తాజీప్రసాద్